

కళాక్షేత్రంలో రసరంజని (హైదరాబాద్) ప్రదర్శించిన 'ప్రజానాయకుడు - ప్రకాశం' నాటకంలోని దృశ్యం

# ప్రజానాయకుడు ప్రకాశం

## ఆద్యంతం ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

విజయవాడ, ఆగస్టు 12 (ప్రభాతవార్త): రసరంజని(హైదరాబాద్) ఆధ్వర్యాన శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ప్రజానాయకుడు ప్రకాశం నాటకం ప్రేక్షకుల ప్రశంసలను అందుకొంది. రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి ఐన టంగుటూరి ప్రకాశం 'స్వీయ చరిత్ర నా జీవితయాత్ర'లో ఆయన లిఖించిన అంశాల నాటకం రూపకం కల్పించడంలో దర్శకుడు మొదలి నాగభూషణ శర్మ సఫలీకృతులయ్యారు. ప్రతి ఘట్టాన్ని రమణీయంగా మలచడంలో రచనా పటుత్వం సన్నివేశాలలో ప్రస్ఫుటమై ప్రేక్షకుల మదిని అలరించింది.

సుమారు 50 మంది నటవర్గంతో, 15 మంది సాంకేతిక నిపుణులతో చేసిన నాటక యజ్ఞం ప్రకాశం జీవితాన్ని కమనీయశైలిలో వర్ణించింది. కథ, కధనంతోపాటు పక్క సంగీత సహకారంతో, వినసొంపైన వ్యాఖ్యానంతో ఆహ్లాదంగా నడిచింది. ప్రేమమయి మాతృమూర్తి అంతిమ ఘడియల సన్నివేశం ప్రేక్షకులకు కంటతడిపెట్టించింది. సందర్భానుసారంగా పట్టున్న సంభాషణలు ఈ వియోగ ఘట్టానికి నటుల ఆహార్యం, అంగీకాభినయం జతకలిసి కరుణరసాన్ని కురిపించింది. స్వాతంత్ర్యం రాకపూర్వమే రాజకీయాల్లో చేరిన కుళ్లును కడిగేసింది.

ఇప్పటి తరం చూడలేని స్వాతంత్రోద్యమ ప్రముఖ నాయకుల రూపాలు నటులకు చక్కగా ఇమిడాయి. ప్రకాశం పాత్ర ధరించిన కుమారి ఆర్. హేమమానస, నడిమింటి జగ్గారావు, చాట్ల శ్రీరాములు నటనలో పరిణతి కనబరిచారు. ఆదర్శనాయకులు ఇలా ఉండాలి, అలా ఉండాలి అని చెప్పేవారే కాని ఆ విధంగా నాయకులు ఉండాలనుకోవడం లేదని ఈ నాటకం అంతర్లీన గంభీర సందేశాన్ని ఇచ్చింది.

విజయవార్త
ఆదివారం 13 ఆగస్టు 2000